సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 4 । మే । 2025



గంభీరావుపేట బంద్

గంభీరావుపేట: పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ గంభీరావుపేటలో శనివారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. పాకిస్థాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.



గర్జనపల్లిలో బడిబాట

వీర్నపల్లి: గర్జనపల్లి స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ రాకేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం బడిబాట చేపట్టారు. టీచర్లు కులేరి ప్రేమ్‌సాగర్, తిరుపతిజాదవ్ పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
38.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. కానీ జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కులగణన నిర్ణయం చారిత్రాత్మకం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

సిరిసిల్లటౌన్: దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పేర్కొన్నారు. సిరిసిల్లలోని తన నివాసంలో శనివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా 60 ఏళ్లుగా కాంగ్రెస్ అధికారంలో ఉండి కులగణన చేయలేదని విమర్శించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, పొన్నాల తిరుపతిరెడ్డి, గజబీంకార్ చందు, కొండ నరేశ్, చొప్పదండి శ్రీనివాస్, దుమాల శ్రీకాంత్, వంతడుపుల సుధాకర్, సిరిసిల్ల వంశీ, మోర శ్రీహరి, ఊరగొండ రాజు, గుడ్ల విష్ణు పాల్గొన్నారు.

వాహనపత్రాలు వెంట ఉంచుకోవాలి

- జిల్లా రవాణాశాఖ అధికారి వంశీధర్



తనిఖీ చేస్తున్న జిల్లా రవాణాశాఖ అధికారి

బోయినపల్లి(చొప్పదండి): వాహనాల పత్రాలను వెంట ఉంచుకోవాలని జిల్లా రవాణాశాఖ అధికారి వంశీధర్ పేర్కొన్నారు. మండలంలోని కొదురుపాక చౌరస్తాలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు సంబంధించిన లైసెన్స్‌లు పరిశీలించారు. డ్రైవర్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. కండక్టర్ లైసెన్స్ లేని రెండు ఆర్టీసీ బస్సుల కండక్టర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సరైన వాహన పత్రాలు లేని మూడు సరుకు రవాణా వాహనాలను సీజ్ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వీసీలు సౌమ్య, ప్రశాంత్, హోమ్‌గార్డు ఎల్లయ్య ఉన్నారు.

సమ్మె నోటీస్ అందజేత



ఏవోకు నోటీస్ అందిస్తున్న కార్మిక నేతలు

సిరిసిల్లటౌన్: సార్వత్రిక సమ్మె నోటీస్‌లను జిల్లా అధికారులకు అన్ని ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 చట్టాలలో 29 చట్టాలను మార్చి 4 కోడ్‌లుగా విభజించి కార్మికులకు తీరని అన్యాయం చేసిందన్నారు. ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కడారి రాములు, అన్నల్‌దాస్ గణేష్, గొట్టె రుక్మిణీ, వెంగల శ్రీనివాస్, చిట్యాల మధు పాల్గొన్నారు.

వేములవాడలో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం

వేములవాడ: కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్(కేడీసీఏ) ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి జూన్ 6 వరకు వేములవాడలో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఆగంరావు, ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు శనివారం ప్రకటనలో తెలిపారు. 13 నుంచి 23 సంవత్సరాల్లోపు బాలురు, బాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 3 వరకు ఆసక్తి గల వారు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 91772 59935లో సంప్రదించాలని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ సాధికారిత సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్

సిరిసిల్ల: స్థానిక సంస్థలకు 14 నెలలుగా ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షుడు పాలాస నరేందర్ విమర్శించారు. ఈమేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు కేంద్రం ద్వారా పల్లెలకు విడుదల కాకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు లేక.. నిధులు రాక పల్లెల్లో వసతులు కరువయ్యాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించి కేంద్రం నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి సాక్షి

ప్రజా సమస్యల పరిష్కారంలో ‘సాక్షి’ దినపత్రిక ముందుంటోంది. అవినీతి, అక్రమాలను వెలికితీస్తూ.. అక్రమార్కులపై పంజా విసురుతోంది. అభాగ్యులకు అండగా ఉంటూ.. సమస్యల పరిష్కారానికి సాక్ష్యంగా నిలుస్తోంది. ఇలా మరో అడుగు వేసి.. సమస్యల పరిష్కారంలో పాఠకులనూ భాగస్వామ్యం చేస్తోంది. ‘వాట్సాప్ చేయండి’ శీర్షికన నిత్యం ఫొటో కథనాలు ప్రచురిస్తోంది. వారివారి ప్రాంతాల్లో నెలకొన్న సమస్యను ‘సాక్షి’కి వాట్సాప్ చేస్తే.. కథనం ప్రచురించి, పరిష్కారం అయ్యే విధంగా చొరవ తీసుకుంటోంది. ఇలా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొంతకాలంగా వందలాది సమస్యలు పరిష్కారం అయ్యాయి. దీంతో ‘సాక్షికి సలాం’ అంటూ పాఠకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- వివరాలు IIలో▸


సాక్షికి సలాం

పత్తి రైతుపై విత్తన భారం

- ఐదేళ్లలో ప్యాకెట్‌పై రూ.200 పెంపు
- ఈ ఏడాది పెరిగిన రూ.37
- జిల్లాలో 44వేల ఎకరాలకు పైగా సాగు
- జిల్లా రైతులపై ఏటా రూ.అర కోటి భారం



దుక్కిలో పత్తి విత్తనాలు వేస్తున్న మహిళ కూలీలు(ఫైల్)

చందుర్తి(వేములవాడ): పత్తి రైతులకు విత్తనాలు భారంగా మారుతున్నాయి. ఏటా కేంద్ర ప్రభుత్వం పత్తి విత్తనాల ధరలు పెంచుతుండడం రైతులకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదే సమయంలో పత్తి మద్దతు ధర గురించి పట్టించుకోవడం లేదు. విత్తన ధరలు పెంచిన ప్రభుత్వం మద్దతు ధర సైతం పెంచాలని రైతులు కోరుతున్నారు. మార్కెట్‌లో 450 గ్రాముల పత్తి ప్యాకెట్ రూ.864 ఉండగా.. ప్రస్తుతం ప్యాకెట్ ధరను రూ.901కి పెంచింది. ఎకరానికి మూడు ప్యాకెట్లు వినియోగిస్తే ఏటా అదనంగా రూ.111 భారంగా మారుతుంది. ఇలా జిల్లాలో 44 వేల సాగు అవుతుండడంతో రైతులపై ఏటా రూ.50లక్షలకు పైగానే ఆర్థిక భారం పడుతుంది.

గిట్టుబాటు ధర అంతంతే..

జిల్లాలోని 2.28 లక్షల ఎకరాల్లో పంటలు సాగు అవుతుండగా.. వరి 1.74లక్షల ఎకరాలు, పత్తి 44,650 ఎకరాలు, మిగతా మొక్కజొన్న, కందులు 7వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. గత మూడేళ్లుగా అధిక వర్షాలు పడుతుండడంతో పత్తికి తెగుళ్లు ఆశిస్తున్నాయి. దీంతో రైతులు విచ్చలవిడిగా క్రిమిసంహారక మందులు వాడుతున్నారు. అధిక వర్షాలు పంటల దిగుబడిపై ప్రభావం చూపుతుండడం, తెగుళ్ల నివారణకు వాడే క్రిమిసంహారక మందులతో వ్యయం పెరిగిపోతుంది. ఒకప్పుడు ఎకరాకు 8 నుంచి 14 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా.. ప్రస్తుతం 6 నుంచి 7 క్వింటాళ్లకు పడిపోయింది. ప్రస్తుతం సీసీఐ గరిష్ఠంగా క్వింటాల్‌కు రూ.7,521 పెడుతుంది. నాణ్యత లేదనే సాకుతో రూ.7,421లకే కొనుగోలు చేసింది. బహిరంగ మార్కెట్‌లో మాత్రం రూ.6,300 నుంచి రూ.6,500 వరకే కొంటున్నారు.

పత్తి విత్తన ప్యాకెట్ల ధరలు

2019	రూ.710
2020	రూ.730
2021	రూ.767
2022	రూ.810
2023	రూ.853
2024	రూ.864
2025	రూ.901

పెరిగిన పెట్టుబడి వ్యయం

విత్తనాల ధరతోపాటు ఎరువులపై కేంద్రం ఇచ్చే సబ్సిడీని తగ్గించడంతో కాంప్లెక్స్ ఎరువుల ధరలు ఏకంగా రూ.360 నుంచి రూ.700 వరకు పెరిగాయి. ఇదే సమయంలో పత్తి ధరను మాత్రం క్వింటాల్‌కు రూ.310 మాత్రమే పెంచింది. వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెరగడంతో ఇంధన ఖర్చు సైతం పెరిగింది.

లూజ్ విత్తనాల వైపు రైతు చూపు

కేంద్ర ప్రభుత్వం పత్తి విత్తనాల ధరలను పెంచడంతో రైతులు లూజ్ పత్తి విత్తనాలు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొందరు వ్యాపారులు లూజ్ పత్తి విత్తనాలను ఆంధ్ర ప్రాంతం నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నారనే ప్రచారం ఉంది. ఈ విత్తనాలను కిలోకు రూ.550 నుంచి రూ.700 ధరకు విక్రయిస్తుండడంతో వీటిపైనే రైతులు దృష్టి సారిస్తున్నారు. కంపెనీ విత్తనాలు అయితే ఎకరాకిని రూ.3,604 ఖర్చు అవుతుండడంతో రైతులు భారంగా భావిస్తూ లూజ్ విత్తనాలు కొంటున్నారు.

విత్తనాల ధరలు తగ్గించాలి



రైతులకు సాగు ఖర్చు ఏటా పెరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలను తగ్గించడంతో ఎరువుల ధరలు పెరిగాయి. పత్తి విత్తనాల ధరలు పెరుగుతుండడంతో ఏటా భారం పెరుగుతోంది. ఎరువులు, విత్తనాలపై సబ్సిడీ పెంచడం సాధ్యం కాకపోతే కనీసం పంటలకైనా గిట్టుబాటు ధరలు పెంచి ఆదుకోవాలి.

– కటకం చంద్రయ్య, బండపల్లి

తుప్పు పడుతున్నాయి



ఇది ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీజ్ చేసిన ట్రాక్టర్. ఠాణాలో స్థలాభావంతో బయట నిలుపుతున్నారు. పట్టుకున్న పెద్ద వాహనాల (లారీలు, ట్రాక్టర్లు, జీపులు)ను ఇలా ఠాణా బయట ఉంచుతున్నారు. వీటిపై పోలీసులు నిఘా పెట్టకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు వాటి భాగాలను ఎత్తుకెళ్తున్నారు. దీంతో రికవరీ చేసుకునే సమయంలో అన్ని పార్టులు లేక వాహనదారులు ఆర్థికంగా నష్టపోతున్నారు. అప్పటికే కోర్టు ద్వారా అనుమతులు పొందడ ఆలస్యం కావడం, మళ్లీ కొత్త పార్ట్స్ కొనడం ఇబ్బందిగా మారుతుంది.

- ఠాణాల్లోనే వాహనాలు
- పట్టుకున్న వాహనాలపై నజర్ కరువు
- మాయమవుతున్న పార్ట్స్
- ఆందోళనలో వాహనదారులు
- జిల్లాలో పట్టుబడ్డ వాహనాలు 550



ఎల్లారెడ్డిపేట ఠాణాలో పట్టుబడ్డ వాహనాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో వివిధ సందర్భాల్లో పట్టుబడ్డ వాహనాలు ఠాణాల్లోనే తుప్పుపడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లోని పోలీస్‌స్టేషన్లలో పట్టుబడ్డ వాహనాలు 550 వరకు ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణా, పీడీఎస్ బియ్యం, కలప రవాణా, నాటుసారా తరలింపు, సరైన ధ్రువీకరణపత్రాలు లేని వాహనాలను పోలీసులు సీజ్ చేస్తున్నారు. కేసు విషయంలో కోర్టు వరకు పోవడం.. అక్కడ తీర్పు వచ్చే వరకు జాప్యమవుతుండడంతో ఠాణాల్లోనే వాహనాలు పాడవుతున్నాయి. కొన్ని ఠాణాల్లోని ఆవరణలో స్థలం లేక సీజ్ చేసిన వాహనాలను బయట మైదానంలో నిలుపుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాల బ్యాటరీలు, టైర్లు, ఇతర విడిభాగాలను ఎత్తుకెళ్తున్నారు. పట్టుకున్న వాహనాలపై పోలీసుల నిఘా లేకపోవడంతో విడిభాగాలు మాయమవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జరిమానాలు.. ఆపై పార్ట్స్ మాయం

వాహనాలు పట్టుబడ్డ సమయంలో పోలీసులు కేసు నమోదు చేస్తుండడంతో బాధితులు కోర్టుకు వెళ్తున్నారు. అక్కడ జరిమానాలు చెల్లిస్తూ తమ వాహనాలను విడిపించుకుంటున్నారు. ఇదే సమయంలో ఠాణా పరిధిలో ఉన్న కొన్ని వాహనాల పార్ట్స్ మాయమవుతుండడంపై వాహన యజమానులు ఆందోళన చెందుతున్నారు. కొత్తవి కొనేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని వాహన యజమానులు పేర్కొంటున్నారు.

ఏళ్లుగా ఠాణాల్లోనే వాహనాలు

వివిధ కేసుల్లో పట్టుబడుతున్న వాహనాలను కొందరు యజమానులు తీసుకెళ్లేందుకు ముందుకు రావడం లేదు. సారాయి తరలింపు, ప్రమాదాలు జరిగిన సమయంలో తుక్కుతుక్కయిన వాహనాలను రికవరీ చేసేందుకు వాహన యజమానులు ముందుకురావడం లేదు. ఇలా జిల్లా వ్యాప్తంగా 550 వాహనాలు ఠాణాల్లోనే ఉంటున్నాయి. కొన్ని వాహనాలు తుప్పుపట్టి ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి.

కేవలం ఎక్సైజ్‌శాఖలో పట్టుబడ్డ వాహనాలను మాత్రమే అప్పుడప్పుడు వేలం వేస్తున్నారు. పోలీస్ అధికారులు పట్టుకున్న వాహనాలను వేలం వేయడం లేదు. పోలీస్ అధికారులు ముందుకొచ్చి వేలం వేసినా ప్రభుత్వానికి ఎంతో కొంత ఆదాయం కూడా వచ్చే అవకాశం ఉంటుందనే పలువురు అభిప్రాయపడుతున్నారు.

డాక్యుమెంట్స్ లేకనే జాప్యం



పట్టుబడ్డ వాహనాల్లో చాలా వాటికి డాక్యుమెంట్స్ సరిగా ఉండడం లేదు. వాహన యజమాని ఒకరు కావడం, పట్టుబడ్డ సమయంలో మరొకరి వద్ద వాహనం ఉంటుండడంతో డాక్యుమెంటేషన్ సమస్యతో కోర్టులో అనుమతులు లభించడం లేదు. సారా తరలింపు సమయంలో పట్టుబడ్డ వాహనాలు, ప్రమాదాలకు గురైన వాహనాలను తీసుకెళ్లేందుకు వాటి యజమానులు ముందుకురావడం లేదు. దీంతోనే వాహనాలు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంటున్నాయి.

– శ్రీనివాస్‌గౌడ్, ఎల్లారెడ్డిపేట సీఐ

ఉన్నత లక్ష్యంతో చదవాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- విద్యార్థులకు అభినందనలు



నెహ్రూనగర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: విద్యార్థులు పక్కా ప్రణాళిక చదివి ఉన్నత స్థానాలకు చేరాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆకాంక్షించారు. పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను శనివారం అభినందించారు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట మోడల్‌స్కూల్ విద్యార్థులు విష్ణుప్రియ 580, విగ్నారెడ్డి 573, వైష్ణవి 553, అలేఖ్య 551 మార్కులు సాధించారు. జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్ జెడ్పీ స్కూల్ విద్యార్థులు సాయిహర్షిత్ 573, భానుతేజ 562, నవజీత్ 561, సుశత 558, కావ్య 545, మైత్రి 531, భవ్య 535 మార్కులు సాధించారు. సీపీవో శ్రీనివాసాచారి, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక సాయం

అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మూడు పేద కుటుంబాలకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శనివారం ఆర్థిక సహాయం అందించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తంగళ్లపల్లి మండలం రామచంద్రాపూర్‌కు చెందిన దాసరి మల్లవ్వ, కోనరావుపేట మండలం కొలనూర్‌కు చెందిన కుమ్మరికుంట కళావతి, వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన సింగం నర్సయ్య అనారోగ్యంతో ఉన్నామని, ఆర్థిక సాయం అందించాలని కలెక్టర్‌కు విన్నవించారు. చలించిన కలెక్టర్ శనివారం ఒక్కో కుటుంబానికి రూ.25వేల చొప్పున చెక్కులు అందించారు. కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో నిరసన



కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న స్వర్ణకారులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో స్వర్ణకారులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ముస్తాబాద్‌లో జువెల్లరీ దుకాణానికి అనుమతులు ఇవ్వవద్దని కోరుతూ చేపట్టిన దీక్షలు శనివారం పదో రోజుకు చేరాయి. అధికారులు స్పందించి వెంటనే దుకాణం పనులు నిలిపివేయాలని కోరారు. ఈసందర్భంగా కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. స్వర్ణకారుల సంఘం మండల అధ్యక్షుడు చింతోజు బాలయ్య, బ్రహ్మం, శ్రీను, వెంకటేశ్, అనిల్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, హాజరైన వైద్యులు

వేములవాడఅర్బన్: ఆస్పత్రికొచ్చే రోగులకు అన్నిరకాల నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. వేములవాడ ఏరియా ఆస్పత్రి వైద్యులతో శనివారం సమావేశమయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎల్‌వోసీల ద్వారా ఇప్పటి వరకు రూ.20కోట్లకు పైగా మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఓపీ సేవల కోసం వచ్చిన వారు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. మోకాళ్ల సర్జరీలు విజయవంతంగా పూర్తి చేయడంపై వైద్యులను అభినందించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ పెంచలయ్య, వైద్యుడు సంతోష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వంతో కలసిరండి

వేములవాడ: ప్రజా ప్రభుత్వంతో కలిసి రావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడ రూరల్ మండలం జయవరం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు 50 మంది శనివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆది శ్రీనివాస్ పార్టీ కండువా కప్పారు. కులగణన చేపట్టి దేశానికి తెలంగాణ రోల్‌మోడల్‌గా నిలిచిందన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో దీక్షలో కూర్చున్న విషయాన్ని గుర్తు చేశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరుగుతున్నాయన్నారు.

నెరవేరుతున్న ప్ర‘జల’ ఆశలు

- ‘ఎత్తిపోతల’కు కార్యరూపం
- ‘మల్కపేట’ నుంచి నేడు నీటి విడుదల
- విడుదల చేయనున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సాక్షి ఎఫెక్ట్

సిరిసిల్ల: మెట్టప్రాంత రైతుల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. గోదావరి జలాలను ఎత్తిపోతల ద్వారా మళ్లించి బీడు భూములను సస్యశ్యామలం చేస్తామనే పాలకుల ఐదు దశాబ్దాల హామీ కార్యరూపం దాల్చుతోంది. ఈ ప్రాంత ప్ర‘జల’ ఆశలు నెరవేరుతున్నాయి. కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ కుడికాల్వ ద్వారా 12 గ్రామాలకు సాగునీటిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం విడుదల చేయనున్నారు. ఈమేరకు నీటిపారుదలశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. కోనరావుపేట, వేములవాడ అర్బన్ మండలాల్లోని బీడు భూములను తొలిసారి గోదావరి జలాలు ముద్దాడనున్నాయి.

కాల్వలను శుభ్రం చేసి

కోనరావుపేట కనగర్తి–సుద్దాల గ్రామాల మధ్య కాల్వలో పేరుకుపోయిన మట్టిని నీటిపారుదల శాఖ అధికారులు ఇటీవల తొలగించారు. మల్కపేట రిజర్వాయర్ నీరు వేములవాడ అర్బన్ మండలం మారుపాక వెళ్లేలా పైపులైన్ పూర్తి చేశారు. మధ్యమానేరు నుంచి మల్కపేట వరకు 12.035 కిలోమీటర్ల సొరంగం పనులు పూర్తయ్యాయని, సొరంగంలో కాంక్రీట్ లైనింగ్ పనులు, సర్జిపూల్, పంప్‌హౌస్, డెలివరీ పైపులైన్ పూర్తి చేసి మల్కపేట రిజర్వాయర్‌లో ఒక్క టీఎంసీ నీటిని నింపినట్లు తెలిపారు. మల్కపేట నుంచి కెనాల్ ద్వారా మైసమ్మ చెరువు వరకు నీటిని విడుదల చేశామన్నారు.

కాళేశ్వరం–9 ప్యాకేజీలో ఎత్తిపోతలు

కాళేశ్వరం–9 ప్యాకేజీలో గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు వరకు గోదావరి జలాలను ఎత్తిపోసేందుకు మూడు టీఎంసీల సామర్థ్యంతో మల్కపేట రిజర్వాయర్ నిర్మించారు. మల్కపేటకు మధ్యమానేరు నుంచి ఇప్పటికే నీరు వస్తుంది. ప్రస్తుతం మల్కపేట నుంచి కుడికాల్వ ద్వారా కోనరావుపేట మండలం మల్కపేట, కనగర్తి, నాగారం, పల్లిమక్త, సుద్దాల, రామన్నపేట, మంగళ్లపల్లి, వేములవాడ మండలం మారుపాక వరకు నీటిని విడుదల చేయనున్నారు. మల్కపేట కుడికాల్వ సామర్థ్యం 350 క్యూసెక్కులు కాగా.. 25,654 ఎకరాలకు సాగునీరు అందించనుంది.



మల్కపేట రిజర్వాయర్‌లో నీటి నిల్వ



కనగర్తి–సుద్దాల మధ్య మల్కపేట కుడి కాల్వలో మట్టిని తొలగిస్తున్న అధికారులు

ఎత్తిపోతలపై ‘సాక్షి’ ఎన్నో కథనాలు

జిల్లాను సస్యశ్యామలం చేసే గోదావరి జలాల ఎత్తిపోతల పథకం పనులపై ‘సాక్షి’ అనేక సందర్భాల్లో గ్రౌండ్ రిపోర్టును అందించింది. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ–9 పనుల ప్రగతిపై ఎప్పటికప్పుడు కథనాలను ప్రచురించింది. 2013లోనే ఈ పథకానికి అప్పటి మంత్రులు సుదర్శన్‌రెడ్డి, శ్రీధర్‌బాబు రగుడు వద్ద శంకుస్థాపన చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సుజల స్రవంతి పథకంగా నామకరణం చేసి పనులు ప్రారంభించగా.. ఆ పేరును కాళేశ్వరం–9వ ప్యాకేజీగా మార్చి పనులు చేశారు. సొరంగం పనులు, రిజర్వాయర్ పనులు పూర్తయినా బ్యాలెన్స్ పనులను, ఆర్థిక శాఖ ద్వారా నిధులు విడుదల చేయించి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పూర్తి చేయించారు. దశాబ్దాల నాటి ఎత్తిపోతల పథకం కార్యరూపం దాల్చింది.



రాజన్నకు వీకెండ్ రద్దీ

వేములవాడ: రాజన్నకు వీకెండ్ తాకిడి పెరిగింది. శనివారం 30వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు ఆచరించి అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణాలు, సత్యనారాయణ వ్రతాలు, అమ్మవారికి కుంకుమపూజ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.35లక్షల ఆదాయం సమకూరింది.



క్లుప్తంగా

ప్రాణం తీసిన మామిడికాయలు

- చెట్టు పైనుంచి పడి వృద్ధుడు మృతి

గోదావరిఖని: మామిడికాయలు తెంపడానికి చెట్టెక్కి ప్రమాదవశాత్తు కిందపడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని చంద్రశేఖర్‌నగర్‌లో నివాసముంటూ వండ్రంగి పనులు చేస్తున్న నాగవెల్లి బాలయ్య(70).. శనివారం ఉదయం తన ఇంటి వెనకాల ఉన్న మామిడి కాయలు తెంపడానికి చెట్టు ఎక్కాడు. కర్రతో కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి చెట్టు పైనుంచి కింద పడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. కరీంనగర్‌కు తీసుకెళ్తుండగా బాలయ్య మార్గమధ్యంలో మృతి చెందాడు. బాలయ్యకు భార్య నాగవెల్లి సుగుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రోడ్డుప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలు


గాయపడిన బాల్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పింఛన్ డబ్బు కోసం బ్యాంక్‌కు వస్తే, వాహనం ఢీకొని ఓ వృద్ధుడు ప్రాణాపాయ స్థితికి చేరాడు. స్థానికుల వివరాలు.. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్ గ్రామానికి చెందిన వృద్ధుడు రమావత్ బాల్య పింఛన్ డబ్బుల కోసం గొల్లపల్లిలోని బ్యాంక్‌కు వచ్చాడు. రోడ్డు దాటుతుండగా కామారెడ్డి నుంచి వస్తున్న మహారాష్ట్రకు చెందిన బొలెరో వాహనం వేగంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన బాల్య అపస్మారక స్థితికి వెళ్లాడు. 108 వాహనంలో ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని ప్రశాంత్‌నగర్‌లో చీమల తిరుపతిపై హత్యాయత్నం చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ రమేశ్ తెలిపిన వివరాలు.. 2021లో ప్రశాంత్‌నగర్‌కు చెందిన బండారి మొగిలి హత్య కేసులో చీమల తిరుపతి, రాగుల రాజశేఖర్, బోనగిరి రాకేశ్ నిందితులు. బెయిల్‌పై విడుదలయ్యారు. కేసు ట్రయల్‌కు వస్తుందని రాజీ పడదామని ప్రధాన నిందితుడు తిరుపతిని రాజశేఖర్, రాకేశ్ కోరారు. అందుకు తిరుపతి ఒప్పుకోలేదు. తిరుపతిని హత్య చేస్తే గతంలోని హత్య కేసు నుంచి తప్పించుకోవచ్చని నిర్ణయించుకున్నారు. ఈనెల 2న తిరుపతి నడుపుతున్న ఆన్‌లైన్ సెంటర్‌కు రాజశేఖర్, రాకేశ్ వెళ్లి అతడిపై కత్తులతో దాడిచేసి పారిపోయారు. శనివారం నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

బాగైన చేతిపంపు.. తీరిన నీటి కొరత



బోరు మరమ్మతుపై కథనం



బోయినపల్లి(చొప్పదండి): మండలకేంద్రంలోని ప్రైమరీ స్కూల్ పరిసరాల్లో ఉన్న చేతిపంపు పని చేయడం లేదని, ఆప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారని మార్చి 27న 'సాక్షి'లో ప్రచురితమైన **బోరు మరమ్మతు చేస్తున్న సిబ్బంది** కథనానికి అధికారులు స్పందించారు. అదే రోజు ఎంపీడీవో జయశీల చేతిపంపును బాగు చేయించారు.

అధికారులు త్వరగా స్పందించారు



బోయినపల్లి ప్రైమరీ స్కూల్ పరిసరాల్లో బోరు చెడిపోయింది. మా సమస్యను 'సాక్షి' వెలుగులోకి తీసుకురాగా, అధికారులు వెంటనే స్పందించారు. ఎంపీడీవో ఆదేశాలతో బోరుకు మరమ్మతు చేశారు. మా ఏరియా ప్రజలకు నీటి కొరత తీర్చిన 'సాక్షి'కి సలాం.
– మాడిచెట్టి శ్రీనివాస్, బోయినపల్లి

సమస్యను పరిష్కరించిన ఎస్సై



రోడ్డుపై గుంతను జేసీబీతో పూడ్చివేయిస్తున్న ఎస్సై ప్రసాద్

కమాన్‌పూర్(మంథని): కమాన్‌పూర్ మండలం పేరపల్లి నుంచి రొంపికుంటకు వెళ్లే దారిలో సాగునీటి సరఫరా కోసం పైపులైన్ ఏర్పాటు చేయగా రోడ్డుపై గుంత ఏర్పడింది. ఈనేపథ్యంలో మార్చి 27న 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా ఎస్సై ప్రసాద్ స్పందించారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా జేసీబీతో గుంతను పూడ్చివేయించారు.

సాక్షికి సలాం

వాట్సాప్.. హ్యాట్సాప్

సమస్య ఏదైనా.. పరిష్కారంలో 'సాక్షి' ముందుంటోంది. ప్రజా ఇబ్బందులను నిత్యం వెలుగులోకి తీసుకువస్తూ వారికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. బాధితుల పక్షాన ఉంటూ మన్ననలు పొందుతోంది. ఇటీవల కాలంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో పలు సమస్యలపై 'సాక్షి' వాట్సాప్ కథనాలు ప్రచురించగా.. అధికారులు వెంటనే స్పందించి పరిష్కారానికి చొరవచూపారు. దీంతో 'సాక్షి'కి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.


సీసీ రోడ్, మెయిన్‌రోడ్‌కు కనెక్టివిటీ లేకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా గొయ్యి


'సాక్షి' కథనంతో కల్వర్ట్ నిర్మాణం


మార్చి 12న 'సాక్షి' వాట్సప్ కథనం

అడ్డు తొలగింది.. రోడ్డు పడింది

కరీంనగర్‌కార్పొరేషన్: కరీంనగర్ నగరపాలక సంస్థ 9వ డివిజన్ పరిధిలోని అలకాపురికాలనీ నుంచి సిరిసిల్ల బైపాస్ (ఎన్‌టీఆర్ చౌరస్తా) వైపు వచ్చే రోడ్డు ముగింపు వద్ద పనులు అసంపూర్తిగా వదిలేశారు. విద్యుత్ పోల్, లైన్లు అడ్డుగా ఉండడంతో పూర్తి చేయలేదు. సీసీ రోడ్ ఎత్తుగా, ఆర్అండ్‌బీ మెయిన్ రోడ్ దిగువన ఉండడం, కిందినుంచి నాలా వెళ్తుండడంతో, రెండింటికీ కనెక్టివిటీ లేక సీసీ రోడ్డు చివరలో పెద్ద గొయ్యి ఏర్పడింది. దీంతో రాత్రివేళ వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యేవారు. ఓ వ్యక్తి అందులో శవమై తేలాడు కూడా. ఏళ్ల తరబడి సమస్య అలానే ఉండడంతో అలకాపురికాలనీకి చెందిన దుంపేటి రాము మార్చి 12న



పోల్ తొలగించడంపై..

'సాక్షి' ద్వారా వెలుగులోకి తీసుకురాగా, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పేయ్ స్పందించారు. ట్రాన్స్‌కో అధికారులతో పలు మార్లు చర్చలు జరపడంతో, రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని మార్చి 27న తొలగించారు. దీంతో సీసీ, మెయిన్‌రోడ్డులను కలుపుతూ కల్వర్ట్ నిర్మించి, రోడ్డు వేయడంతో సమస్య పరిష్కారమైంది.

ధన్యవాదాలు



మా కాలనీవాసులు నిత్యం ఎదుర్కొనే సమస్యను పరిష్కరింపచేసిన 'సాక్షి'కి ధన్యవాదాలు. సీసీ రోడ్డు ను ఆర్అండ్‌బీ రోడ్డుకు కలపకపోవడం, కింద నాలా ఉండడంతో ఆ గొయ్యిలో చాలా మంది పడి గాయపడ్డారు. 'సాక్షి' 'వాట్సప్ చేయండి' శీర్షికలో మా కాలనీ వ్యక్తి రాము సమస్యను తెలియచేయడంతో అధికారులు స్పందించి వైర్లు, పోల్‌ను తొలగించి రోడ్డు వేశారు.
– లోకేందర్‌రావు, అలకాపురికాలనీ, కరీంనగర్

ప్రమాదకర కల్వర్టు.. స్పందించిన కమిషనర్


మార్చి 21న ప్రచురించిన కథనం



మార్చి 25న కల్వర్టును పరిశీలించిన కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం బల్దియా పరిధిలోని ఫైవింక్లయిన్ చౌరస్తా సమీపంలో కొత్త కల్వర్టు ప్రమాదకరంగా ఉండడం, ఇరువైపులా సైడ్‌వాల్ నిర్మించకపోవడంతోపాటు కనీసం రోడ్డుకు సమానంగా మట్టి కూడా పోయలేదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. ఈ సమస్యపై మార్చి 21న 'సాక్షి'లో కథనం ప్రచురించగా, బల్దియా కమిషనర్ జె.అరుణశ్రీ స్పందించారు. మార్చి 25న కల్వర్టును పరిశీలించి యుద్ధప్రాతిదికన పనులు చేపట్టాలని ఆదేశించారు.

కృతజ్ఞతలు



ఫైవింక్లయిన్ చౌరస్తా సమీపంలో కొత్తగా నిర్మించిన కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. సమస్య పరిష్కారమయ్యేలా చొరవ తీసుకున్నందుకు 'సాక్షి'కి కృతజ్ఞతలు. మున్సిపల్ కమిషనర్, అధికారులు వెంటనే స్పందించారు. పనులు ప్రారంభించారు. 33వ డివిజన్ పరిధిలోని ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.
– మద్దెల దినేశ్, ఫైవింక్లయిన్ ఏరియా, గోదావరిఖని

అందుబాటులోకి క్రీడాప్రాంగణం


'సాక్షి'లో ప్రచురితమైన కథనం


క్రీడాప్రాంగణాన్ని శుభ్రం చేయిస్తున్న అధికారులు

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని ధర్మనాయక్‌తండా క్రీడాప్రాంగణం గ్రామానికి దూరంగా ఉంది. క్రీడాప్రాంగణంపై గ్రామపంచాయతీ నిర్వాహణ లేకపోవడంతో పిచ్చిమొక్కలతో నిండిపోయింది. ఈక్రమంలో ఫిబ్రవరి 10న 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా, అధికారులు స్పందించారు. అదే నెల 12న ఎంపీడీవో గంగాధర్ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలు క్రీడాప్రాంగణంలోని పిచ్చి మొక్కలను తొలగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకవచ్చారు.

వాహనాలు పార్కింగ్ వీడాయి



వాహనాలు తొలగించిన తర్వాత చేపల మార్కెట్


చేపల మార్కెట్లో పార్క్ చేసిన వాహనాలు

జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో చేపల మార్కెట్ లోపల వాహనాలు పార్క్ చేస్తుండటంతో కొనుగోలుదారులు నిలబడటానికి స్థలం లేకుండాపోయింది. ఈ సమస్యపై మార్చి 19న ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ స్పందన స్పందించారు. చేపల మార్కెట్ నుంచి వాహనాలు తొలగించాలని తమ సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతి వాహనాలను తొలగింపజేశారు. కాగా, వాహనాల తొలగింపుతో మార్కెట్‌లో సౌకర్యవంతంగా ఉందని, తక్షణమే స్పందించిన బల్దియా సిబ్బందితో పాటు వార్త ప్రచురించిన 'సాక్షి'కి కొనుగోలుదారులు ధన్యవాదాలు తెలిపారు.

రైతు ముంగిట్లోకి వ్యవసాయ శాస్త్రవేత్తలు

- ఈ నెల 5 నుంచి జూన్ 13 వరకు గ్రామాల్లో సదస్సులు
- వివిధ సాగు అంశాలపై రైతులకు శిక్షణ కార్యక్రమాలు


పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం

జగిత్యాలఅగ్రికల్చర్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకు దగ్గరయ్యేందుకు రెండు ప్రధాన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించింది. వానాకాలం సీజన్ లోపు ప్రతీ గ్రామానికి నాణ్యమైన విత్తనం, రైతు ముంగిట్లోకి వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాలను అమలు చేయాలని సంకల్పించారు. ఇందుకోసం పొలాస పరిశోధన స్థానం పరిధిలో 15 శాస్త్రవేత్తల బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతీ బృందంలో శాస్త్రవేత్త, ఇద్దరు విద్యార్థులు, వ్యవసాయ అధికారులు ఉంటారు.

ప్రతీ గ్రామానికి నాణ్యమైన విత్తనం

ప్రతీ గ్రామానికి నాణ్యమైన విత్తనం కార్యక్రమాన్ని జూన్ 2న నిర్వహిస్తారు. దీని ద్వారా ప్రస్తుత వానాకాలం సీజన్‌కు ప్రతీ గ్రామంలోని 3–5 మందిని ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు పరిశోధన స్థానాల్లో శాస్త్రవేత్తలు రూపొందించిన అన్నిరకాల విత్తనాలు అందజేస్తారు. యాసంగి నాటికి, ఈ అభ్యుదయ రైతులు పండించిన విత్తనాన్ని గ్రామంలోని మిగతా రైతులకు ఇవ్వాలని నిర్ణయించారు. తద్వారా నాణ్యమైన విత్తనం గ్రామాల్లోని రైతులకు అందుబాటులోకి రావడం పట్ల ప్రైవేట్ కంపెనీల విత్తనాలకు చెక్ పెట్టాలని భావిస్తున్నారు. అలాగే తక్కువ ధరకు గ్రామాల్లోనే నాణ్యమైన విత్తనం లభించే అవకాశం ఉంది.

దిగుబడిపై మెలకువలు

రైతు ముంగిట్లోకి వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ప్రతీ గ్రామంలో ఈ నెల 5 నుంచి జూన్ 13 వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు. ఆయా పంటల శాస్త్రవేత్తలు గ్రామాలకు వెళ్లి సాగులో రైతులు చేసే తప్పులు, అధిక దిగుబడికి తీసుకోవాల్సిన మెలకువల గురించి వివరిస్తారు. అవసరాన్ని మించి పురుగు మందులు, రసాయన ఎరువులు వాడటం వల్ల సాగు భూమి పనికి రాకుండా పోతుందనే దానిపై రైతులతో చర్చించనున్నారు. సాగు నీటి యజమాన్యం, అవసరాన్ని మించి వాడటం వల్ల కలిగే అనర్థాలు, పంట మార్పిడి చేయడం వల్ల లాభాల గురించి వివరిస్తారు.

బృందాలు ఏర్పాటు చేశాం



రైతులకు నాణ్యమైన విత్తనం అందించడంతో పాటు శాస్త్రవేత్తల పరిశోధనలు వారి దరికి చేర్చాలనే ఉద్దేశంతో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థులతో 15 బృందాలు ఏర్పాటు చేశాం.
– డాక్టర్ శ్రీలత, వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్

కలిసుంటామని కడతేర్చాడు

- పిల్లలు పుట్టడం లేదని భార్యను చంపిన భర్త
- ఉరేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నం
- కేసును ఛేదించిన పోలీసులు.. ఐదుగురిపై కేసు


మమత (ఫైల్)

జగిత్యాలక్రైం: నిండునూరేళ్లు కలిసి ఉంటామని.. ఏడడుగులు నడిచి ప్రమాణం చేసిన భర్తే కాలయముడై భార్యను హత్య చేసిన ఘటన జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలకేంద్రంలో జరిగింది. హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నించగా ఎట్టకేలకు పోలీసులు కేసును ఛేదించారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు.

ఇరవై ఏళ్ల క్రితం వివాహం

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మల్లాపూర్‌కు చెందిన మమతను (35) ఇరవై ఏళ్ల క్రితం జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన అవుదుర్తి మహేందర్‌కు ఇచ్చి వివాహం చేశారు. వివాహ సమయంలో కట్నకానుకలు ముట్టజెప్పారు. కానీ, ఆర్థిక సమస్యలు తలెత్తడంతో కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. మహేందర్ మద్యానికి బానిసై అప్పులు చేశాడు. రోజూ తాగి వచ్చి మమతను వివాహ సమయంలో కట్నం తక్కువగా ఇచ్చారని, పిల్లలు పుట్టడం లేదని తీవ్రంగా వేధించాడు. అతడితోపాటు తల్లి వజ్రవ్వ, తండ్రి లక్ష్మణ్, తమ్ముళ్లు అనిల్, వెంకటేశ్ కూడా వేధింపులకు గురిచేసేవారు. మహేందర్ ఏ పని చేయకపోవడంతో మమత కరీంనగర్‌లోని ఓషాపింగ్‌మాల్‌లో ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది.

ఇరవై రోజుల క్రితం పంచాయితీ

తరుచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో 20 రోజుల క్రితం మల్లాపూర్‌లో పంచాయితీ నిర్వహించారు. దీంతో మమతను బాగా చూసుకుంటానని మహేందర్ కరీంనగర్‌లోని అద్దె ఇంటికి తీసుకెళ్లాడు. అనంతరం పుస్తెల తాడు ఇవ్వాలని మమతను కోరగా నిరాకరించింది. ఈనేపథ్యంలో మహేందర్ గతనెల 26న నల్లగొండ, వేములవాడ దైవ దర్శనానికని నమ్మించి, దైవ దర్శనం అనంతరం కొడిమ్యాలకు తీసుకెళ్లాడు. అదేరోజు నైలాన్ తాడును ఆమె మెడ చుట్టూ బిగించి హత్య చేశాడు. ఆత్మహత్య చేసుకున్నట్లు నమ్మించేందుకు ఆమె మెడకు నైలాన్‌తాడు చుట్టి ఇంటి స్లాబ్‌కు కట్టాడు. పుస్తెలతాడు తీసుకొని గంగాధరలోని ఓ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి డబ్బు తీసుకుని అప్పులు తీర్చాడు. ఈక్రమంలో పోలీసులు లోతుగా విచారణ చేయగా అసలు విషయం బయటపడింది. శనివారం నిందితుడు మోటారుసైకిల్‌పై పారిపోతుండగా చెప్యాల ఎక్స్‌రోడ్ వద్ద అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడితో పాటు అతడి తల్లిదండ్రులు, తమ్ముళ్లపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మల్యాల సీఐ రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్ పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య


సమ్మక్క(ఫైల్)

రామగిరి(మంథని): మండలంలోని కల్వచర్ల గ్రామం కొండిన్యనగర్‌లో శుక్రవారం రాత్రి ఓ మహిళ దారుణహత్యకు గురైంది. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాలు.. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి తాండూర్‌కు చెందిన మోటం సమ్మక్క (35) భర్త కొద్ది రోజుల క్రితం మృతిచెందాడు. అనంతరం ఆమె కొంతకాలంగా కరీంనగర్‌కు చెందిన పత్తి కనకరాజుతో కలిసి మంచిర్యాల జిల్లా దండెపల్లిలో ఉంటోంది. ఇరువురు పాత ఇనుప సామగ్రి వ్యాపారం చేసుకుంటూ ఊరూరా తిరుగుతుంటారు. ఈ క్రమంలో ఏప్రిల్ 30న సమ్మక్క, కనకరాజుతో కలిసి తన బాబాయి తూర్పాటి భిక్షపతి ఇంటికి కల్వచర్లకు వచ్చింది. శుక్రవారం రాత్రి భిక్షపతి ఎదుట సమ్మక్క, కనకరాజు గొడవపడగా ఆపే ప్రయత్నం చేశాడు. అయినా గొడవ సద్దుమణగకపోడంతో భిక్షపతి తన భార్య జంపమ్మను తీసుకురావడానికి వెళ్లాడు. ఆమెను తీసుకుని వచ్చేలోపు సమ్మక్క రక్తపుమడుగులో పడి ఉంది. కనకరాజు సిమెంట్ ఇటుకతో దాడి చేసి పరారయ్యాడని భిక్షపతి తెలిపాడు. మృతురాలి తమ్ముడు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఘటన స్థలాన్ని గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాద్‌రావు పరిశీలించారు. సమ్మక్కకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆటోపై విరిగిపడిన రావిచెట్టు


ఆటోపై పడిన రావిచెట్టు


జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ చౌరస్తా వద్ద మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం రాత్రి రావిచెట్టు కొమ్మ విరిగి కిందపడటంతో అక్కడే ఉన్న ఆటో నుజ్జునుజ్జయింది. కోటయ్య అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. విద్యుత్ వైర్లు తెగిపోవడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వెంటనే స్థానికులు కోటయ్యను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యుత్ సిబ్బంది మరమ్మతు చేపట్టి సరఫరాను పునరుద్ధరించారు.

ప్రాణం మీదికి తెచ్చిన మామిడికాయ వక్క

- ఊపిరాడక తల్లడిల్లిన బాలుడు

పాలకుర్తి(రామగుండం): మామిడికాయ వక్క గొంతులో ఇరుక్కుని బాలుడు ఊపిరాడక నరకయాతన అనుభవించిన ఘటన శనివారం పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామంలో జరిగింది. 108 సిబ్బంది కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ పదినెలల వయసు ఉన్న బాలుడు ఇంట్లో మామిడివక్క మింగాడు. అది గొంతులో ఇరుక్కుని ఊపిరాడలేదు. వెంటనే స్పందించిన కుటుంబసభ్యులు బైక్‌పై పెద్దపల్లికి తరలిస్తూ కన్నాల గ్రామానికి చేరుకున్నారు. అప్పుడే ఎదురుగా 108 వాహనం రావడంతో అందులో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి బయలుదేరారు. మార్గమధ్యలో 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స ప్రారంభించారు. ఎయిర్‌వేను కొంతమేర క్లియర్ చేస్తూ పెద్దపల్లికి చేరుకున్నారు. పెద్దపల్లిలో పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందంటూ కరీంనగర్‌కు రెఫర్ చేయడంతో మరో అంబులెన్స్ ద్వారా కరీంనగర్‌కు తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం బాబు పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిసింది. కాగా ఈ విషయమై సోషల్‌మీడియాలో విభిన్న కథనాలు వైరల్ అయ్యాయి.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


వికాస్ (ఫైల్)

సైదాపూర్(హుస్నాబాద్): నాలుగేళ్ల ప్రాయంలో ఊహ తెలియక ముందే తల్లిదండ్రులను కోల్పోయాడు. 10 నెలల క్రితం తాత, 6 నెలల క్రితం నానమ్మ మృతిచెందారు. నా అనే వారు ఎవరూ లేరు. ఒంటరి తనం, అనారోగ్యం భరించలేక ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాలు.. సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన అనగోని సంపత్–సుజాత దంపతుల కుమారుడు వికాస్(27). నాలుగేళ్ల వయస్సులో తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతిచెందారు. అప్పటి నుంచి తాత, నాన్నమ్మ లక్ష్మయ్య, లక్ష్మి వద్ద పెరిగాడు. హుస్నాబాద్‌లోని ఓ షాపులో పని చేశాడు. అనారోగ్యంతో బాధపడుతున్నాడు. 10 నెలల క్రితం తాత, 6 నెలల క్రితం నానమ్మ మృతిచెందారు. ఒంటరితనం, అనారోగ్యంతో ఐదురోజుల క్రితం గడ్డిమందు తాగాడు. చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం, అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని మృతదేహం

కరీంనగర్‌క్రైం: ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన వారు ఎవరైనా ఉంటే ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలి కోరారు.



కిటకిటలాడిన కొండగట్టు

మల్యాల(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే స్వామివారి దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. కోనేరులో స్నానమాచరించి మొక్కులు చెల్లించుకున్నారు. దంపతులు సామూహిక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పర్యవేక్షించారు.

